క్లుప్తంగా

ఘనంగా అశోకుడి విగ్రహావిష్కరణ


అశోకుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: మండలంలోని దుప్పాపూర్ గ్రామంలో గల బౌద్ధ విహార్‌లో సాహిత్య సామ్రాట్ అశోక విగ్రహాన్ని మంగళవారం బుద్ధఘోష్ బంతేజీ ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో, గౌతమ బుద్ధుడి శాంతి మార్గం ద్వారా ముందుకు సాగాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, గ్రామ పెద్దలు శ్రీరామ్, కనక ప్రభాకర్, మాజీ సర్పంచ్ కనక సేవంత బాయి, మధుకర్, జ్ఞానోబా, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చైత్రమాసం పూర్తి కావడంతో మంగళవారం ఇంద్రవెల్లి మండలంతో పాటు ఉట్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, ఆదిలాబాద్ తదితర గ్రామాల ఆదివాసీలు పెద్దసంఖ్యలో ఇంద్రాదేవి ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావు, ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అభిమానం చాటిన విద్యార్థి


చిత్రాన్ని బహూకరిస్తున్న వంశీ

నేరడిగొండ: ఇచ్చోడ మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి గులే వంశీ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై తన అభిమానం చాటుకున్నాడు. ఎమ్మెల్యే చిత్రాన్ని తన ప్రతిభతో పెన్సిల్ ఆర్ట్‌తో గీశాడు. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి ఆ చిత్రాన్ని బహుమతిగా అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీని అభినందించారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ పని కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

ఇచ్చోడ: ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి పని కల్పించే విధంగా సిబ్బంది చొరవ చూపాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండలంలోని సిరిచెల్మలో చెరువులో మట్టి పూడికతీత పనులను ప్రారంభించి కూలీలతో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు అడిగిన ప్రతీ ఒక్కరికి వంద రోజులపాటు పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు. సిరిచెల్మ చెరువు మట్టి పూడిక తీతను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో నరేందర్‌గౌడ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ


దివ్యాంగులను సన్మానిస్తున్న అధికారులు

బోథ్: మండల కేంద్రంలో ఓటుహక్కు సద్వినియోగంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా యువజన సర్వీసుల అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, సీఐ రమేశ్, ఎస్సై రాము, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, బూత్ లెవెల్ అధికారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీవో మహేందర్ రెడ్డి, ఏపీఎం మాధవ్, పంచాయతీ సెక్రటరీలు, ఐకేపీ సిబ్బంది, సామాజిక సేవకుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

- ఎండ వేడితో తీవ్ర ఒత్తిడి
- కరువైన నీడ, నీరు
- తట్టుకోలేక ప్రజలపై దాడులు చేస్తున్న శ్వానం
- నీటితొట్లు అవసరమంటున్న పశువైద్యులు


కౌటాలలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

శునకాల్లో సమ్మర్ స్ట్రెస్!

కౌటాల: జిల్లాలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతున్నప్పటి నుంచి పలుచోట్ల మనుషులపై వీధి కుక్కలు దాడులు చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 46 సెల్సియస్ డిగ్రీలు దాటితే పశువులు, కుక్కలు సమ్మర్ స్ట్రెస్‌కు గురవుతాయని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. సరైన తిండి, నీరు, కరువవుతుండడంతో వీధి కుక్కలు, వీధి పశువుల్లో ఈ తరహా లక్షణాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు.

నీళ్ల కరువు..
ప్రస్తుత వేసవికాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లో నీరు అడుగంటిపోయింది. ఇంటింటికీ కుళాయిలు రావడంతో వీధి కుళాయిలు, బోర్ల సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా ఇలాంటి నీటి వనరులపై ఆధారపడే వీధి కుక్కలకు తగినంత నీరు లభించని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రోడ్ల విస్తరణ, కరెంటు వైర్ల కోసం చెట్లు నరికేయడం, రోడ్లపైనే వాహనాల పార్కింగ్ వంటి కారణాలతో సరైన నీడ కూడా లేకుండా పోతోంది. దీంతో కుక్కలు సమ్మర్ స్ట్రెస్‌కు లోనవుతున్నాయి. ఈ సమయంలో వాటి కవే తగువు పెట్టుకుంటాయని, ఏ మాత్రం కవ్వించినా దాడి చేయడానికి వెనుకాడవని నిపుణులు పేర్కొంటున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు కుక్కలను రాళ్లతో కొట్టడం, కళ్లలో కళ్లు పెట్టి చూడటం, బెదిరించినట్లుగా ప్రవర్తించడం చేయకూడదని సూచిస్తున్నారు.

మూలన పడిన ప్రతిపాదనలు
వేసవిలో వీధి కుక్కలతో పాటు పశువులకు సైతం నీరు అందించేందుకు గతంలో గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్లు(వాటర్ ట్రోట్) ఉండేవి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు కొన్ని సందర్భాల్లో స్థానికులు, జంతు ప్రేమికులు సైతం నీటిని అందుబాటులో ఉంచేవారు. కొన్నేళ్లుగా నీటి తొట్ల నిర్వహణ లేక చాలా చోట్ల కనుమరుగైపోయాయి. మరికొన్ని చోట్ల ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయి. మూడేళ్ల క్రితం నీటి తొట్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాలని అన్ని జిల్లాల పశుసంవర్ధక శాఖ అధికారులను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదేశించింది. ప్రతిపాదనలు సిద్ధం చేసి సర్కారుకు అందించినా ఎలాంటి ప్రగతి కనిపించలేదు. మరోవైపు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో గతంలో నిర్మించిన తొట్లకు మరమ్మతుల నిధులు సైతం మంజూరు కావడం లేదు. తొట్టెలు నిర్మించాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే నిర్మిస్తామని ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

రెచ్చిపోతున్నాయి..
జిల్లాలోని గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగా కుక్కలు ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్నాయి. ఈ వేసవిలో మార్చి, ఏప్రిల్ నెలల్లో దాదాపుగా జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా వీధి కుక్కల కాటు కేసులు నమోదయ్యాయి. గతేడాదిలో జిల్లాలో 2807 మందిపై కుక్కలు దాడులు చేశాయి. గ్రామాల్లో వీధి కుక్కలు దాడులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దాడులు చేస్తున్నాయి



మా గ్రామంలో తారు రోడ్డు దాటుతుంటే ఓ వీధి కుక్క దాడి చేసి గాయపర్చింది. దీంతో కుడి కాలిపై కుక్కగాట్లు పడ్డాయి. వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాను. గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ దాడులు చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.
– దిగంబర్, యాపలగూడ

ఉష్ణోగ్రతలతో ఒత్తిడి



ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే కుక్కలు ఒత్తిడికి లోనవుతాయి. దీంతో కలహించుకునే స్వభావం వాటిలో పెరుగుతుంది. తాగునీటిని అందుబాటులో ఉంచడం ద్వారా కొంత మేర సమస్యను అదుపులోకి తీసుకురావచ్చు.
– శ్రీకాంత్, పశువైద్యాధికారి, కౌటాల


పట్కల్‌మంగి గ్రామంలోని పల్లెప్రకృతి వనం

ఎండిన పల్లె ప్రకృతివనం


నిర్వహణ లేక ఎండిన హరితహారం మొక్కలు

పల్లె ప్రకృతివనంతో పాటు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నిర్వహణ కరువై ఎండిపోతున్నాయి. లింగాపూర్ మండలం మోతిపటార్ గ్రామ పంచాయతీలోని పట్కల్ మంగి గ్రామ పరిధిలోని పల్లెపకృతి వనం పూర్తిగా ఎండిపోయింది. ఇందులో దాదాపు 40 రకాల మొక్కలు పెంచుతున్నారు. వన సేవకుడు లేక నిర్వహణ గాలికి వదిలేయడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా హరితహారంలో భాగంగా రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలకు నీరు పోయకపోవడం, ట్రీగార్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎండిపోతున్నాయి. అయినా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.– లింగాపూర్

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి'


దహెగాం: మాట్లాడుతున్న ఆనంద్


ఆసిఫాబాద్‌రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

దహెగాం: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వామి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమాన్ని పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పూర్తిగా విస్మరించిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోట శ్రీనివాస్, నాయకులు అశోక్, బక్కన్న, సాయిక్రిష్ణ, దామోదర్, లక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పీసీసీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మోవాడ్, బలన్‌పూర్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతు ప్రచారం చేశారు. గత ప్రభుత్వాలు 10 సంవత్సరాలు అధికారంలో ఉండి గ్రామాలను అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, సాయి, బాలేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రతీహామీని అమలు చేసే సత్తా కాంగ్రెస్‌కే ఉంది
రెబ్బెన: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండలం నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు విశ్వప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు. నారాయణపూర్ ఎంపీటీసీ దుర్గం రాము, గంగాపూర్ ఎంపీటీసీ వాలువోజీ హరిత, గంగాపూర్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశం చారీ, తుంగెడ మాజీ సర్పంచులు పెంటయ్య, పర్వతాలు, వార్డు సభ్యులు, నాయకులు, యువకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు, నాయకులు కొవ్వూరి శ్రీనివాస్, మురళీ, మల్లారెడ్డి, ఆనంద్ రావు, రవీందర్, వెంకన్న, పూదరి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.


రెబ్బెన: కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం
దేశంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని ఎడవెల్లి, పులికుంట, గోలేటిలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు దుర్గం రవీందర్, కిషన్ గౌడ్, సురేందర్ రాజు, సాంబగౌడ్, శ్యాం, పూదరి సాయి, ప్రభాకర్, తిరుపతి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


గోలేటిలో అజ్మీర శ్యాంనాయక్

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలి
తిర్యాణి: ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్ పాషా కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో విలేకరులతో మాట్లాడారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి, నాయకులు రత్నం పోషన్న, బండారి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

దహెగాం: వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీఎస్‌వో వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ, కుంచవెల్లి, తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తూర్పారా పట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. తప్ప, తాలు లేకుండా 17శాతానికి తేమ మించకుండా ధాన్యం ఉండాలని రైతులకు సూచించారు. ప్యాడీ క్లీనింగ్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఈవో బక్కయ్య, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తహసీల్దార్ పుష్పలతకు ముత్తంపేట్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 6న రాత్రి బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో భాగంగా ముత్తంపేటలోని అంబేద్కర్ విగ్రహం గద్దెపైకి చెప్పులు వేసుకొని ఎక్కి ప్రచారం చేసినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, వెంకటేశ్, మోతీరాం, మహేందర్, శ్యాంరావు, అరుణ్, శ్యాంరావు, ప్రవీణ్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్సీ దండే విఠల్


గోలేటిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బెజ్జూర్: ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో బెజ్జూర్, చింతలమానేపల్లి మండలాలకు చెందిన కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 420 మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పరిపాలన సౌలభ్యాల కోసం జిల్లాలను, మండలాలను విభజిస్తే కుమురంభీం జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం కుదించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ ధైర్యం లేని వారు వేరే పార్టీలకు దారిపట్టారని, గుండె నిండా ధైర్యం ఉన్న కార్యకర్త గులాబీ జెండా పట్టుకొని నిలబడ్డారన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్సీ విఠల్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, మాజీ జెడ్పీటీసీ పిల్లల తిరుపతి, మాజీ ఎంపీటీసీ భాగ్య, నాయకులు సామల రాజన్న, సోయం చిన్నయ్య, షమీఉద్దీన్, రాజన్న, మహేశ్, అశోక్, సతీశ్, సురేశ్, వైకుంఠం, మోహిని, నీలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దు'
రెబ్బెన: కాంగ్రెస్ ఉద్దెర హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతూ గోలేటి టౌన్‌షిప్‌లోని కార్మిక వాడల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచులు సుమలత, తోట లక్ష్మణ్, నాయకులు వెంకటేశం, శంకర్, ఆసిఫ్ దయాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కొండపల్లిలో బీజేపీ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో పార్లమెంట్‌కు పంపించాలన్నారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఘనపురం నగేశ్, భుజంగరావు, ఎంపీటీసీ రాజన్న, గణపతి, శేఖర్, పురుషోత్తం, సంతోష్, వెంకన్న, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ కళాశాలలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలకు 80 మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో గల ఎస్సీ కాలనీ మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని, కాలనీలో చేతిపంపు సైతం సరిగా లేక నీళ్ల కోసం అవస్థలు పడుతున్నామని వాపోయారు. దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలుపుతూ మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మహిళలు పంచాయతీ కార్యాలయం వద్దకు ఖాళీ బిందెలతో వెళ్లి నీరు సరఫరా జరిగేలా చూడాలని కోరారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి విజయ్ ట్యాంకర్ ద్వారా కాలనీవాసులకు నీటి సరఫరా చేశారు. మహిళలు గంగమ్మ, విజయ, నాగమణి, దేవిక తదితరులు ఉన్నారు.

బీజేపీ ర్యాలీ విజయవంతం చేయండి

నేరడిగొండ: ఇచ్చోడ మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు మద్దతుగా బుధవారం ప్రచారానికి గోషామహల్ ఎమ్మెల్యే రా జాసింగ్ రానున్నట్లు బీజేపీ నేరడిగొండ మండ ల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ తెలిపారు. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మహిళలు ర్యాలీ లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అద్దంకి దయాకర్ ఫ్లెక్సీ దహనం

ఆదిలాబాద్‌టౌన్: హిందూ దేవతలను కించపర్చే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన బహిరంగ సభల్లో అద్దంకి దయాకర్ హిందు దేవతలను కించపర్చుతూ మాట్లాడారన్నారు. బీజేవైఎం, బీజేపీ నాయకులు సూర్యకిరణ్, పాయల్ శరత్, మహేందర్, శివకుమార్, రాకేష్, రఘుపతి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రవిశంకర్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని ఏఆర్టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ రవిశంకర్‌ను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సన్మానించారు. మంగళవారం ఏఆర్టీ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఏఆర్టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధితులకు సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తానాజీ జాడే, గజానంద్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమే స్వచ్ఛత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: దేశంలోని ప్రతీ గ్రామం స్వచ్ఛతగా, పరిశుభ్రతగా ఉందంటే పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఎక్కడికి వెళ్లినా పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యం ఇచ్చి సత్కరించి గౌరవిస్తున్నారన్నా రు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌తో కలిసి వారిని ఓట్లు అభ్యర్థించారు. అశోక్, రవి, ప్రవీణ్, లాలామున్న, కృష్ణ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.